మహబూబాబాద్ రూరల్ : బేతోలులో కరపత్రాలు పంచుతున్న పార్టీ నాయకులు

కేసముద్రం: మ్యానిఫెస్టో అందిస్తూ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ శ్రేణుల ఇంటింటా ప్రచారం

- పార్టీ మ్యానిఫెస్టో ప్రతుల పంపిణీ
- కారు గుర్తుకే ఓటెయ్యాలని వినతి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 22 : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ బేతోలు గ్రామ కార్యదర్శి షేక్ ఖాదర్‌బాబా అన్నారు. బుధవారం గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో గ్రామాలు ఏమాత్రం అభివృద్ధి చెందలేదని, సీఎం కేసీఆర్ ప్రతి కాలనీకి సీసీ రోడ్డు ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణను అనతి కాలంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసి దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కు అండగా నిలిచి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సంతోష్, నర్సింహారావు, సంపత్, భుజంగరావు, జావిద్, ఫిరోజ్, ఇమ్రాన్, ఆఫ్రిద్, యాకూబ్, ఖాజా, జానీ, రఫీ, నాయకులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్.. తెలంగాణకు రక్షణ కవచం

కేసముద్రం : సీఎం కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే తెలంగాణ రాష్ట్రానికి రక్షణ కవచంగా ఉంటుందని ఎంపీటీసీ గుజ్జునూరి రాజు అన్నారు. బీఆర్ఎస్ మానుకోట అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను మరోసారి గెలిపించాలని కోరుతూ బుధవారం మండలంలోని కోరుకొండపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కటిచ చీకట్లు తప్పవని, అరిగోప పడుతామని, పాత రోజులు, కష్టాలు మళ్లీ వస్తాయని వివరించారు. రాష్ట్రం మంరిత అభివృద్ధి చెందాలంటే సీఎం కేసీఆర్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాగెళ్లి శ్రీనివాస్, బీరం రామ్మోహన్‌రెడ్డి, పనికర యాకమల్లు, ఉప్పల్‌రెడ్డి, కొమురయ్య, శ్రీరాంరెడ్డి, ఉప్పలయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

బంజారాలకు బీఆర్ఎస్‌తోనే భవిష్యత్

బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు బాలూ చౌహాన్

మాట్లాడుతున్న బాలూ చౌహాన్

బయ్యారం, నవంబర్ 22 : బంజారాలకు బీఆర్ఎస్‌తోనే బంగారు భవిష్యత్ అని ఆల్ ఇండియా బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బాలూ చౌహాన్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బంజారాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో 3,400 తండాలను జీపీలుగా మార్చి బంజారాల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. నేడు తండాల్లో మౌలిక వసతులు మెరుగయ్యాయన్నారు. అలాగే గిరిజనుల దశాబ్దాల కల పోడు సమస్యను తీర్చారన్నారు. పోడు పట్టాలు అందించి, పెట్టుబడి కోసం రైతు బంధు అందించడం హర్షణీయమన్నారు. బంజారాల కోసం రూ. 40 కోట్లతో హైదరాబాద్‌లో బంజార భవన్ ఏర్పాటు చేసిన విషయం గుర్తు చేశారు. బంజారాల సంక్షేమం కోసం పాటు పడుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలువాలని కోరారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే తండాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కేంద్రం బాధ్యులు

భేటీ పడావో.. భేటీ బచావోపై అవగాహన

కురవి, నవంబర్ 22 : మండలంలోని నేరడ గ్రామంలోని కేజీబీవీలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం బేటీ పడావో.. బేటీ బచావోపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జండర్ స్పెషలిస్టు నలమాస అరుణ మాట్లాడుతూ సమాజంలో అమ్మాయిలకు రక్షణ కరువైందని, వారిపై లింగ వివక్ష చూపొద్దన్నారు. తల్లిదండ్రుల్లో మార్పు రావాలని, అమ్మాయిలు, అబ్బాయిలను సమానంగా పెంచితే మార్పు సాధ్యమవుతోందన్నారు. బాలికలు పోషకాహారం తీసుకోవాలన్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వో సరస్వతి, మహిళా సాధికారిత కేంద్రం సిబ్బంది సంధ్యారాణి, రాకేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదవాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 22 : కళాశాల దశలో విద్యార్థులు శ్రద్ధగా చదవాలని గౌతమి జూనియర్ కళాశాల డైరక్టర్ తక్కళ్లపల్లి సంధ్యారాణి సూచించారు. బుధవారం కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రెషర్స్ డే నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ్ కుమార్, అధ్యాపకులు జోగయ్య, భాస్కర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నెల్లికుదురులో ర్యాలీ తీస్తున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు

ఓటుహక్కును వినియోగించుకోవాలి

కొవ్వొత్తులతో అవగాహన ర్యాలీ

నెల్లికుదురు, నవంబర్ 22: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కే శేషాద్రి అన్నారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపీడీవో కార్యాలయం నుంచి నెల్లికుదురు మండల కేంద్రం అంబేద్కర్ సెంటర్ వరకు బుధవారం పంచాయతీ కార్యదర్శులతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు వజ్రాయిధం వంటిదని, ఓటు వేయడం ఒక వరమన్నారు. మద్యం, డబ్బు తదితర ప్రలోభాలకు లొంగకుండా నిజాయితో ఓటు హక్కు వినియోగించుకుందామన్నారు. ఓటు వేయడంతో పాటు మన పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంతో నిండిన మార్కెట్

కేసముద్రం, నవంబర్ 22 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ధాన్యంతో నిండిపోయింది. బుధవారం మార్కెట్‌కు 15 వేల బస్తాల ధాన్యం విక్రయానికి వచ్చింది. ఈ ఏడాది వర్షాలు ఆశించిన మేర పడడం, కాళేశ్వరం ప్రాజెక్టు నీరు చెరువులకు చేరడంతో బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. సీఎం కేసీఆర్ పంటలకు పెట్టుబడి సహాయం ఎకరానికి రూ.10 వేలు అందించడం, నాణ్యమైన విత్తనాలు, 24 గంటలు కరెంట్ సరఫరా చేయడంతో రైతులు వరి సాగుపై దృష్టి సారించారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 1,56,000 ఎకరాలు కాగ ఈ ఏడాది 2లక్షల ఎకరాల్లో వరి సాగయ్యింది. సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా సాగు చేశారు. బుధవారం మార్కెట్‌లో సన్న రకం క్వింటాల్ గరిష్ఠ ధర రూ. 2,891, కనిష్ఠ ధర రూ. 2,081 పలికింది.

మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన ధాన్యం

ద్విచక్రవాహనంలో కట్ల పాము

తప్పిన ప్రమాదం..

దంతాలపల్లి, నవంబర్ 22 : మండలంలోని రామవరం గ్రామానికి చెందిన రైతు నల్లపు నర్సింహారావు బుధవారం తన ద్విచక్ర వాహనంపై దంతాలపల్లికి వచ్చాడు. ఓ దుకాణం ముందు వాహనం నిలిపి వస్తువులు కొనుగోలు చేసి వచ్చేసరికి బండి వెనక చక్రం నుంచి కట్ల పాము బయటకు రావడాన్ని నర్సింహారావు గమనించాడు. స్థానికులు కర్రలతో పామును కొట్టి చంపారు.

కరాటే టీమ్ కోచ్‌గా అబ్బు

ఏటూరునాగారం, నవంబర్ 22 : ఇండియా కరాటే టీమ్ కోచ్‌గా మండల కేంద్రానికి చెందిన ఎండీ అబ్బు ఎంపికయ్యారు. ఈనెల 23 నుంచి 26 వరకు కజకిస్తాన్ రాజధాని ఆస్థానలో జరిగే ప్రపంచ స్థాయి కరాటే పోటీలకు ఇండియా టీమ్ కోచ్‌గా అబ్బును నియమించినట్లు ఎఫ్ఎస్‌కేఏ ఇండియా కో ఆర్డినేటర్ గణేశ్ తెలిపారు. అబ్బు 35 సంవత్సరాలుగా కరాటేలో వేలాది మంది విద్యార్థులకు కోచింగ్ ఇచ్చారని పేర్కొన్నారు. అబ్బును పలువురు అభినందించారు.

30 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలు

కురవి, నవంబర్ 22 : ఓపెన్ ఇంటర్, పదో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 30 వరకు అవకాశం ఉన్నట్లు మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాల హెచ్ఎం అల్వాల కార్తీక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయినవారు వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓపెన్ ఇంటర్ కోసం ఎస్ఎస్‌సీ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్, రెండు ఫొటోలు అందించాలన్నారు. పూర్తి వివరాల కోసం 9885214380 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గ్రంథాలయ ఆవిష్కరణలో లక్ష్మీనారాయణ

పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్

గంగారం, నవంబర్ 22 : యువత ఏకాగ్రతతో పుస్తకాలు చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం మండల పరిధిలోని కోమట్లగూడెంలో కాళోజీ గ్రంథాలయ ఆవిష్కరణకు వచ్చారు. ఆయనకు కోదండ రామాలయ సేవా కమిటీ, యువకులు, విద్యార్థులు పూలమాల వేసి స్వాగతం పలికారు. అందరితో కలిసి భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోమట్లగూడెం జీపీ భవన పరిధిలో జేడీ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో పుస్తకాలయం ఏర్పాటు చేసుకోవడం సంతోషం ఉందన్నారు. వాటిని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోదండ రామాలయ కమిటీ చైర్మన్ సైప సురేశ్, వైస్ చైర్మన్ ప్రతాపని శ్రీకాంత్, డైరెక్టర్లు పల్లె సురేశ్, గొగ్గల లక్ష్మయ్య, కొండూరి సంతోష్, సైప రవి, రంజిత్, విద్యార్థులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కళా ఉత్సవాల్లో 'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 22 : పట్టణ శివారు అనంతారం ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కళా ఉత్సవాల పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు పొందారని పాఠశాల ప్రిన్సిపాల్ అమరావతి పేర్కొన్నారు. శాస్త్రీయ నృత్యంలో తేజస్విని, మ్యూజిక్‌లో పాల్‌మోజెస్, బొమ్మల తయారీలో హేమంత్ కార్తీక్, జానపద నృత్యంలో భానూ ప్రకాశ్, నాటకంలో జోగేశ్వర్లు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించినట్లు పేర్కొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన

కేసముద్రం, నవంబర్ 22 : మండలంలోని ప్రభుత్వ జూనియర్, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలల్లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఏరియా మేనేజర్ శాంతరాజ్ మాట్లాడారు. హెచ్ ఐవీ, ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిపై అవగాహన కల్పించారు. ప్రాణాంతకమైన వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు స్వప్న, అజీజ్ బేగ్, సిబ్బంది రమాదేవి, మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ లోగో ఆకారంలో కూర్చున్న విద్యార్థులు